# శ్రమ

మనలో కొంతమంది 'చిన్న చిన్న పనులు' చేయడం తమ డిగ్నిటీకి భంగం అనుకుంటారు! వాళ్ళ దృష్టి ఎప్పుడూ వైట్‌కలర్ జాబ్స్ మీదే ఉంటుంది. చిల్లి గవ్వ ఆదాయం లేకున్నా సరే తమ 'స్థాయి' కి తక్కువ అనిపించే పనులు ససేమిరా ముట్టుకోరు ! తమ పనులు తాము చేసుకోవడానిక్కూడా నామోషీగా ఫీలవుతారు. 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'కి అర్థం తెలీని వీరు... చాపకింద నీరులా దేశమంతా విస్తరించి -దేశ ఆర్థిక వ్యవస్థని ఛిన్నాభిన్నం చేసేస్తారు.

మరి కొంతమంది 'ఏపనీ చేయరు' సరికదా - తమ భారాన్ని కూడా ఇతరుల మీదే మోపుతారు ! తనకంటే యాభైరెట్ల బరువుని అవలీలగా మోసే 'చీమల్ని' చూసైనా తమ 'కర్తవ్యం' గుర్తుకు తెచ్చుకోరు ! గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అనుకునే వీళ్ళు... దేశానికి 'గుదిబండ'ల్లా తయారవుతారు !

కొందరు... 'సమిష్టి'గా చేసిన పనేదైనా 'క్లిక్' అయి అందరి మన్ననలనూ పొందినపుడు... అది తమ గొప్పతనమే అంటారు.

అదే పని ఫ్లాప్ అయితే మాత్రం - చిత్రంగా 'ఫలానా వాడిదే' తప్పంటారు.

మరి కొందరు 'చాలా కష్ట'పడ్తారు! ఏ పనైనా అవలీలగా చేసేస్తారు ! ఎటొచ్చీ వాళ్ళ లోపమల్లా.... 'నా ముందున్న పని 'నాది' అయితే నాల్గు చేతుల్తో శ్రమిస్తాను! అదేపని 'మనది' అయితే మాత్రం నా రెండు చేతుల్నీ దాచేసుకుంటాను...' అనుకోవడమే.

**ఒకరి శ్రమని 'దోచుకోవడం' ఎంత తప్పో... తన శ్రమని 'దాచుకోవడమూ' అంతే తప్పు!**

ఆరోగ్యం బాగాలేక... మంచానికి అతుక్కు పోయిన మనుషుల సంగతి వేరు! కానీ... అవయవాలన్నీ సవ్యంగా ఉండి... **ఏ పనీ చేయకుండా... ఎప్పుడూ ఏ వాలు కుర్చీలోనో, మడత మంచంలోనో పడుకుని...** నక్షత్రాలను లెక్కిస్తూ కాలం గడిపే మనిషి... బ్రతికి **ఉండీ 'పాడె' మీద పడుకున్న 'శవం' తో సమానం !**

ఎప్పుడూ... మన్నుతిన్న పాముల్లా నిస్సత్తువుగా ఉండకుండా.. మనుషులందరూ చురుగ్గా... మెరుపు వేగంతో చరచరా దూసుకెళ్ళే 'కోడెనాగు'లై సాగినపుడు... ఏ దేశమైనా వాయువేగ, మనోవేగంతో అభివృద్ధి చెందుతుంది !



16-10-1995